క్లుప్తంగా

హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతల స్వీకరణ



హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యంను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ పి. సింధు సుబ్రహ్మణ్యం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్యను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు అందుకున్నారు. ఆమెను సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఏడీ రమేష్ బాబు, ఉద్యోగులు అభినందించారు.

ఎంపీడీఓపై దాడి అమానుషం

కర్నూలు (అర్బన్): అన్నమయ్య జిల్లా గాలివీడులో ఎంపీడీఓపై జరిగిన దాడి అమానుషమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై.హేమంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ అధికారులపై ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. ఎంపీడీఓపై దాడి చేసినవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉర్దూ కవి మీర్జా గాలిబ్ జయంతి

కర్నూలు (సిటీ): ఉర్దూ కవి మీర్జా గాలిబ్ జయంతిని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.బషీర్ మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యాన్ని ప్రస్తుత విద్యార్థులకు పరిచేయాలన్నారు. ఉర్దూ సాహిత్యంపై దృష్టి సారించి, ఉర్దూ కవితలపై నైపుణ్యం పెంపొందించేందుకు ఉర్దూ భాష ప్రముఖులను విద్యార్థులకు పరిచయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్య కుమార్, వైస్ ప్రిన్సిపాల్ దీవికారాణి, ఉర్దూ విభాగం అధిపతి డాక్టర్ ఇర్ఫానా బేగం, లెక్చరర్ డాక్టర్ నయాబుర్ రెహమాన్, అరబిక్ లెక్చరర్లు డాక్టర్ ఖాజామొయిద్దీన్, నజాయతుల్లా పాల్గొన్నారు.

రేపు ఐదు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు (అర్బన్): జిల్లాలో ఈనెల 30వ తేదీన సోమవారం ఐదు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఆదోని మండలం జాలిమంచి, పాండవగల్లు, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లో కర్నూలు అర్బన్, ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ, కల్లూరు మండలం రామదూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.

మన్మోహన్ సింగ్ మరణం తీరని లోటు



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరనిలోటని కర్నూలు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి తెలిపారు. ఆయన ప్రధానిగా, ఆర్థిక వేత్తగా దేశానికి విశేష సేవలందించారన్నారు. శనివారం అబ్బాస్‌నగర్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు జయచంద్రారెడ్డి, బాలకృష్ణ, పి.శేషయ్య, సుధాకర్‌శర్మ, ఆంజనేయులు, విజయకుమార్, నారాయణ, మల్లికార్జున, విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చా'కు నమోదు చేసుకోండి

● డీఈఓ శామ్యూల్ పాల్

ఓర్వకల్లు: పరీక్షా పే చర్చాకు నమోదు చేసుకోవాలని డీఈఓ శామ్యూల్ పాల్ అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన పరీక్షా పే చర్చా నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానితో భేటీ కావాలనుకునే వారు ఈ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశం కేవలం విద్యార్థులు, టీచర్లకు మాత్రమే కలదన్నారు. జనవరిలో నిర్వహించే 8వ ఎడిషన్ పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొ నేందుకు 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానిస్తుందన్నారు. పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థులతో సమావేశమై.. వారికి సలహాలు, సూచనలు, వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారన్నారు. జనవరి 14వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. ఆయన వెంట ఎంఈఓ ఓంకార్ యాదవ్, హెచ్‌ఎం ప్రాణేష కుమార్ తదితరులు ఉన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిశీలన



సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ సందీప్ కుమార్

కర్నూలు(రూరల్): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తి తీర్చడానికి సరిపడా నీటి నిల్వల నిమిత్తం గార్గేయపురం గ్రామ సమీపంలోని ఆర్‌డబ్ల్యూఎస్ సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను కర్నూలు రెవెన్యూ డివిజన్ అధికారి కిడారి సందీప్ కుమార్ శనివారం పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి కర్నూలు, ఓర్వకల్లు, వెల్దుర్తి మండలాల పరిధిలో 15 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతాయని అధికారులు తెలిపారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రఘునాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమల, ఏఈ రంగస్వామి, మురళి, గార్గేయపురం పంచాయతీ అధికారి పురుషోత్తం, వీఆర్వో నాయుడు తదితరులు ఉన్నారు.

సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలి

ఓర్వకల్లు: కాల్వబుగ్గ సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ అన్నారు. గ్రామీణ ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతోందని వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శనివారం మండలంలోని కాల్వబుగ్గ సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. కాల్వబుగ్గ స్కీమ్ నుంచి ఏయే గ్రామాలకు నీరు సరఫరా అవుతుంది? ప్రజలు ఆ నీటిని సక్రమంగా వినియోగించుకుంటున్నారా? అనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాల్వబుగ్గ స్కీమ్ నుంచి కాల్వబుగ్గ, కాల్వ, సోమయాజుపల్లె, హుసేనాపురం, ఓర్వకల్లు, తిప్పాయపల్లె, ఎన్ కొంతలపాడు, గుట్టపాడు గ్రామాలకు సరఫరా చేయడం జరుగుతుందని, రెండు గ్రామాలకు పైపులైన్ సక్రమంగా పనిచేస్తున్నాయని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. వీటి నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆర్డీఓ సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమల, ఇంజినీర్లు శ్రీనివాసులు, లోకేశ్వరి ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

కర్నూలు (సిటీ): వచ్చే నెల 12న యాదవ్ హాస్టల్‌లో నిర్వహించనున్న యాదవ్ హాస్టల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశానికి తరలి రావాలని యాదవ్ హాస్టల్ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు పోలకల్ నాగేశ్వరరావు, యనకండ్ల శ్రీనివాసులు, చెన్నుపాడు రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. యాదవ్ హాస్టల్‌లో చదువుకుని దాదాపు 500 మంది వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. ఉరుకుల, పరుగుల జీవితంతో ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు స్నేహితులందరం కలసి అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకునేందుకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. హాస్టల్‌లో ఉండి చదువుకున్న ప్రతి పూర్వ విద్యార్థితోపాటు హాస్టల్ అభివృద్ధి కోరే యాదవ సంఘం నాయకులు, యాదవులు హాజరుకావాలని కోరారు.

హైందవ శంఖారావానికి ప్రత్యేక రైలు

కర్నూలు (అర్బన్): ఆంధ్రప్రదేశ్‌లో హిందూ ఆలయాల విముక్తి కోసం, స్వయం ప్రతిపత్తి కోసం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో 2025 జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం సభకు హిందూ బంధువులు లక్షలాదిగా తరలి రావాలని హైందవ శంఖారావం జిల్లా కన్వీనర్ మాళిగి భానుప్రకాష్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ హైందవ శంఖారావం ప్రాంత కమిటీ సభ్యులు కేంద్ర ప్రభుత్వం, రైల్వే మంత్రిత్వ శాఖతో సంప్రదించి ×హైందవ శంఖారావం* సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నలుమూలల నుంచి 15 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కర్నూలు ప్రజల సౌకర్యార్థం ఒక ప్రత్యేక రైలు కర్నూలు నుంచి జనవరి 4న రాత్రి బయలుదేరనుందని, 18 బోగీల ఈ రైలులో 72 స్లీపర్ సీట్లు ఉంటాయని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ రైలు సభా ప్రాంగణానికి సమీపంలోని ఉప్పలూరు రైల్వేస్టేషన్‌లో ఆగుతుందని, అక్కడి నుంచి నడక మార్గంలో సభా ప్రాంగణానికి చేరుకోవచ్చని తెలిపారు. ప్రయాణికులకు తగిన సౌకర్యాలు, అల్పాహారం ఏర్పాటు చేశారని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని సభను విజయవంతం చేయాలని కోరారు. వివరాలకు చంద్రశేఖర్ 63002 06402, ఈపూరి నాగరాజు 9133544689 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రహదారి విస్తరణ పనులకు సహకరించాలి

● జాయింట్ కలెక్టర్ బి.నవ్య



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ బి. నవ్య

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక నంద్యాల చెక్‌పోస్టు దామోదరం సంజీవయ్య సర్కిల్ నుంచి నందికొట్కూర్ రోడ్డు శ్రీ సాయి గార్డెన్స్ వరకు జాతీయ రహదారి విస్తరణకు ప్రజలు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య కోరారు. శనివారం సాయంత్రం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సంతోష్ ఫంక్షన్ హాలులో రహదారి విస్తరణలో భూమి కోల్పోనున్న బాధితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగుల రహదారిని నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఏవైనా అభ్యంతరాలు, మార్పులు చేర్పులు, యజమానుల అభిప్రాయాలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. బాధితుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. త్వరలోనే మరోసారి సమావేశం నిర్వహిస్తామన్నారు. భూమిని కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, జాతీయ రహదారుల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకర్‌రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

డీసీసీబీ క్యాలెండర్ల విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు 2025 క్యాలెండర్‌ను శనివారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్, అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ నవ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ క్యాలెండర్‌ను ముందస్తుగా విడుదల చేయడం అభినందనీయమన్నారు. బ్యాంకు అమలు చేస్తున్న డిపాజిట్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ విజయకుమార్, జీఎం రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీసీసీబీ చీఫ్ మేనేజర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక కర్నూలు క్లబ్ షటిల్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 29న జిల్లా స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా తైక్వాండో సంయుక్త కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, క్యాడెట్ జూనియర్, సీనియర్ స్థాయిల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. పుంసే, కురుగురే విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలన్నారు. విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. వివరాలకు 9849971256 సంప్రదించాలని తెలిపారు.

నేడు బ్యాడ్మింటన్ పోటీలు

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీకి చెందిన ఇండోర్ స్టేడియంలో ఆదివారం డబుల్స్ విభాగంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కేటగిరీ, 35 ఏళ్ల వయస్సు పైన ఉన్న సీనియర్స్ విభాగంలో ఆసక్తి ఉన్న బ్యాడ్మింటన్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. అన్ని కేటగిరీలలో 30 పాయింట్స్ నాకౌట్, మావిస్ 350 షటిల్ వాడుతున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకు రావాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ. 5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9014778973 సంప్రదించాలన్నారు.

పుట్టిన బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న మాస్ మీడియా అధికారి

కర్నూలు(హాస్పిటల్): మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టి ఎదిగే వరకు అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకోవాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు సూచించారు. శనివారం ముజఫర్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని ఓల్డ్ కల్లూరు ఊరువాకిలి వద్ద జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గర్భిణులకు, బాలింతలకు పోషకాహార ప్రాముఖ్యత గురించి వివరించారు. గర్భిణులు ఆకుకూరలు, పండ్లు, పాలు తదితర బలమైన పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. రక్తహీనతకు గురికాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, సచివాలయ ఆరోగ్య కార్యకర్త మంజుల, ఆశా కార్యకర్త ప్రసన్న లక్ష్మి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

కర్నూలు(హాస్పిటల్): విజయవాడలోని డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ ప్రకటించిన 4వ సెమిస్టర్ నర్సింగ్ ఫలితాల్లో కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. కళాశాలలో 27 డిస్టింక్షన్లు, 55 ఫస్ట్‌క్లాస్‌లు, 10 సెకండ్ క్లాస్‌లు వచ్చాయని కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజీ టాపర్లుగా సునీల(కేరళ), అనుకృష్ణ(కేరళ), శ్రీలేఖ, మాధవి, అనూష, అరుణ నిలిచారన్నారు.

బనగానపల్లె కోర్టు భవనం పరిశీలన



బనగానపల్లెలో కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది

బనగానపల్లె రూరల్: బనగానపల్లెలోని పురాతన కోర్టు భవనాన్ని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది శనివారం సాయంత్రం పరిశీలించారు. ఇటీవలే బనగానపల్లెకు చెందిన న్యాయవాదులు అయన్ను కలిసి శిథిలావస్థలో ఉన్న కోర్టు భవనం గురించి విన్నవించారు. ఈ భవనం పురావస్తుశాఖ ఆధీనంలో ఉండడంతో కోర్టు భవనం కూల్చకుండా పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని జిల్లా న్యాయమూర్తి పరిశీలించారు. నూతన కోర్టు నిర్మాణం అలస్యమైతే పట్టణంలో ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయంలో తాత్కాలికంగా కోర్టు పరిపాలన నిర్వహించాలని బార్ అసోసియేషన్ న్యాయవాదులకు సూచించారు. అలాగే పాత భవనంతో పాటు ఖాళీ స్థలం ఎంత విస్తీర్ణం ఉంది? తదితర వివరాలను జిల్లా న్యాయస్థానానికి పంపాలని, పరిశీలించి వీలైనంత త్వరగా నూతన భవన నిర్మాణానికి ఉన్నత స్థాయి అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట బనగానపల్లె ఇన్‌చార్జ్ జడ్జి అబ్దుల్ రెహ్మాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజాహుస్సేన్, సెక్రటరీ వెంకటేష్, సీనియర్ న్యాయవాదులు రఘురామిరెడ్డి, పరశురామిరెడ్డి, యూసఫ్‌హుస్సేన్, అబ్దుల్‌ఖైర్, ప్రసాద్, శ్రీనివాసమూర్తి, ఆజాం హుస్సేన్, అల్లావుద్దీన్, జాకీర్, ఇర్ఫాన్ అబ్బాస్, నాగేంద్రరెడ్డి, ఇబ్రహీం, విక్రమ్, భాస్కర్‌ఉన్నారు.

30న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (అర్బన్): ఈనెల 30న కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ వినతులను అందించాలని కోరారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, మున్సిపల్, డివిజన్ స్థాయిల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

● గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త

● విజృంభిస్తున్న దోమలు



చిన్నటేకూరులోని డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తచెదారం



బస్తిపాడులోని ఓ వీధిలో చెత్త

కల్లూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. కల్లూరు మండలంలో 18 గ్రామ పంచాయతీలు, నాలుగు మజార గ్రామాలతో కలిపి మొత్తం 24 గ్రామాలు ఉన్నాయి. వీధులు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చెద్దారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువలు, రోడ్లు మురుగు, చెత్త, దోమలు, ఈగలు, లార్వాల సంతతికి నెలవుగా మారాయి. కొన్ని గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంది. దీంతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లోని డ్రైనేజీలు చెత్తచెదారంతో నిండిపోయి పూడికతో ఉన్నాయి. కాలువల్లో మురుగు నీరు ముందుకు పారడం లేదు. నిల్వ చేరి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య లోపంతో దోమలు, ఈగలు, ల్వారాలు ప్రబలుతున్నాయి. గత కొంతకాలంగా గ్రామాల్లో ఎక్కడా పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేసిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కల్వర్టుల పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టండి

● నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు



మురుగు కాల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్) : శిథిలావస్థకు చేరిన కల్వర్టుల పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదేశించారు. శనివారం స్థానిక బుధవారపేటలోని పలు వీధుల్లో కమిషనర్ పర్యటించారు. కల్వర్టులు, మురుగు కాల్వలను అలాగే చేపల గుంత మైదానంలో చేపట్టిన గ్రావెల్, నడకదారి వంటి అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. తక్కువ సామర్థ్యం ఉన్న కల్వర్టులు పునర్మించాల్సి ఉందని సూచించారు. క్రమం తప్పకుండా కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రతి మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని, సంబంధిత పారిశుద్ధ్య విభాగం సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. రహదారులపై ఉన్న గుంతలను ప్యాచ్ వర్కుతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో మురుగు నీరు రోడ్లపైకి రాకూడదన్నారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆహార పదార్థాల రుచి, శుభ్రత గురించి వినియోగదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అంజాద్ బాషా, ట్రైనీ ఏఈ రాంమోహన్ పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయండి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఎస్సీ సామాజికవర్గ జాబితా ప్రదర్శించామని.. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అన్ని సచివాలయాల్లో ఎస్సీ జాబితాను నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. అభ్యంతరాలు ఉంటే వినతుల రూపంలో వీఆర్వోలకు తెలపాలని సూచించారు.

రింగ్ ఫైట్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరంలోని టీజీ వెంకటేష్ ఫంక్షన్ హాలులో శనివారం జాతీయ స్థాయి రింగ్ ఫైట్ పోటీలు ప్రారంభమయ్యాయి. సినీ నటుడు బి.కోటీ, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రింగ్ ఫైట్ పోటీలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఇలాంటి క్రీడల పట్ల బాల, బాలికలు ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రింగ్ ఫైట్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మేంద్రగౌడ్, కార్యదర్శి షేక్ అబ్దుల్లా, ఫయాజ్ అహమ్మద్, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరగనివ్వం



పిన్నాపురం రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

● సోలార్ పరిశ్రమకు భూములిచ్చిన రైతులకు అండగా ఉంటాం

● పరిహారం విషయంలో జాప్యం చేస్తే ఊరుకోం

● పిన్నాపురం రైతులకు కాటసాని భరోసా

పాణ్యం: సోలార్ పరిశ్రమకు భూములిచ్చిన రైతులకు అన్యాయం జరగనివ్వబోమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పాణ్యంలోని పార్టీ కార్యాలయం వద్ద పిన్నాపురం రైతులు, పాణ్యం ప్రజలతో మాట్లాడారు. పిన్నాపురం భూముల విషయంలో రైతులకు న్యాయం జరిగేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. రైతులు పొలాలను త్యాగం చేస్తే ప్రభుత్వం, కంపెనీ ప్రతినిధులు రైతులకు సకాలంలో పరిహారం ఇవ్వకుండా పనులు చేస్తే సహించమన్నారు. రైతుల తరుపున నిలబడి వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. సర్వే నంబర్ 212లో సాగు చేసుకుంటున్న రైతులకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం, కంపెనీ ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. ఈ విషయంపై ఇప్పటికే కంపెనీకి అల్టిమేటం ఇచ్చామన్నారు. వీలైనంత త్వరగా పరిహారం ఇవ్వకుంటే కంపెనీ వద్దకు వెళ్లి తేల్చుకుంటామని తెలిపారు. ఈ విషయమై ఇదివరకే కలెక్టర్‌తో మాట్లాడామని, లిఖిత పూర్వకంగా తెలియజేశామని చెప్పారు. అయినా జాప్యం జరగడం సరికాదన్నారు. ప్రతి రైతులకు న్యాయం చేయాల్సిందేన్నారు. అధికారులు తీరుమార్చుకుని రైతులకు న్యాయం చేయాలన్నారు.

పరిహారం ఇచ్చి పనులు చేసుకోండి

పిన్నాపురం రైతులకు పరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు చేసుకోవాలని కంపెనీ ప్రతినిధులకు ఫోన్‌లో సూచించారు. పరిహారం ఇవ్వకుండా రైతులను వేధిస్తే రైతులతో కలిసి గ్రామానికి రావాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే పరిహారం అందిస్తామని కంపెనీ ప్రతినిధులు సమాధానం ఇచ్చారు. ఆయనతో పాటు బాబు, సునీల్, రమణ, రామచంద్రుడు, టైలర్‌బాషా, ఎల్లగౌడ్, చిన్న సుబ్బయ్య, శేషారెడ్డి, పెద్దస్వామి, సత్యాలు, కిట్టు తదితరులు ఉన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శాదర

కల్లూరు: గ్రామాల్లో ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ శారద అన్నారు. శనివారం ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, ఎంపీటీసీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల జనరల్ ఫండ్ గురించి, జనవరి 3న జరగనున్న మండల సర్వసభ్య సమావేశం గురించి ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓ నాగేశాచలరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వరరావు, మునిస్వామి, సామన్న, సర్పంచ్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. కాగా అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

వెండిపడగ బహూకరణ



వెండి పడగను అందజేస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవళ్లీ సుబ్రమణ్యేశ్వరస్వామికి దాతలు వెండి పడగను కానుకగా సమర్పించినట్లు ఈఓ రామక్రిష్ణ శనివారం తెలిపారు. బనగానపల్లె మండలానికి చెందిన మేడం వెంకటసుబ్బమ్మ కుమారుడు సురేంద్రశెట్టి, సుప్రదీప్తి, రాఘవేంద్ర, శ్వేత, రాజేష్, రమ్య కుటుంబ సభ్యులు 3.90 కేజీల వెండి పడగను అందజేసినట్లు చెప్పారు. వీటి విలువ రూ. 4 లక్షలు ఉంటుందన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

● అభినందన



ఉద్యోగం సాధించిన అభ్యర్థిని సన్మానిస్తున్న సీఐడీ సీఐ జి.పెద్దయ్య నాయుడు

కర్నూలు సిటీ: ఇటీవల విడుదలైన స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ)పోస్టుల పరీక్ష ఫలితాల్లో నగరంలోని ఆర్ఎస్ అకాడమీలో శిక్షణ పొందిన నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారు. వారిని శనివారం అకాడమీలో సీఐడీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.పెద్దయ్య నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూడకుండా ప్రణాళి వేసుకుని చదివితే ఉద్యోగం సాధించడం కష్టమేమీ కాదన్నారు. అనంతరం ఆర్ఎస్ అకాడమీ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ తమ అకాడమీలో శిక్షణ పొందిన భాస్కర్ నాయక్, లాలూనాయక్, రాజు, శేఖర్‌లతోపాటు మరి కొంత మంది ఉద్యోగాలు సాధించారన్నారు. కార్యక్రమంలో ఐఏఎస్ స్టూడెంట్స్ మెంటర్ ఇంద్ర నాయుడు, పీఈటీ మాస్టర్ సురేష్, గణిత ఫ్యాకల్టీ మధు పాల్గొన్నారు.